క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడటౌన్: రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల కారణంగా పట్టణంలోని పెద్ద కాల్వ సెంటర్, లక్ష్మీ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సమావేశం



పామర్రు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన క్రమశిక్షణ కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో కమిటీ భవిష్యత్‌లో తీసుకోవాల్సిన కార్యాచరణ ప్రణాళికల గురించి చర్చించామని అనిల్‌కుమార్ తెలిపారు.

వీరాంజనేయుని హుండీ ఆదాయం రూ.7.34 లక్షలు

పామర్రు: ఉండ్రపూడి – పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.7,34,410 వచ్చిందని ఆలయ ఈవో పీవీఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. స్థానిక ఆలయంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. 75 రోజులకు గాను భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలతో ఈ ఆదాయం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపునకు పర్యవేక్షణ అధికారిగా శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఈవో ఎస్‌వీ సుబ్బారావు వ్యవహరించారని చెప్పారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మట్టా వెంకటేశ్వరరావు, వెన్నా శ్రీనివాసరావు, ఈడే గంటేశ్వరరావు, దాడి పవన్‌కుమార్, కె.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దంపతుల దినోత్సవం



పామర్రు: పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం వారి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ దంపతుల దినోత్సవాన్ని స్థానిక హితమ్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ.. దంపతులు ఒకరిపై ఒకరు అవగాహన పెంచుకుని జీవిస్తున్నారన్నారు. ప్రపంచ దంపతుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక విశ్రాంత ఉపాధ్యాయులు గుమ్మడి వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కళాపీఠం కార్యదర్శి ఎస్.హేమంత్‌రెడ్డి, సభ్యులు పరిశ వెంకట నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

గుడివాడరూరల్: అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారని టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలంలోని చిన ఎరుకపాడు గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి మంజూరైన రూ.80 వేల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ పత్రాలను బాధిత కుటుంబ సభ్యురాలు పామర్తి నాగజ్యోతికి గురువారం అందజేశారు. నాయకులు జగన్మోహనరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

నేడు పామర్రులో 'వికసిత కృషి సంకల్ప అభియాన్'

పామర్రు: అన్నదాతలకు సాగు సాంకేతిక పరిజ్ఞానాన్ని, ప్రభుత్వం అందచేసే పథకాల గురించి స్థానిక మార్కెట్ యార్డులో ఈనెల 30వ తేదీ ఉదయం 9 గంటల నుంచి వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఘంటసాల కేవీకే సమన్వయకర్త, శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా జూన్ 12 వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దేశ రైతాంగానికి సాగు సాంకేతిక పరిజ్ఞానం, రైతులకు అవసరమైన ఇతర సాంకేతిక సమాచారాన్ని శాస్త్రవేత్తల బృందం ద్వారా నేరుగా వారి వారి గ్రామాలకు చేరి అందించే విధంగా ఈ కార్యక్రమం నిర్దేశించారని చెప్పారు.

నేడు అల్లినగరంలో రాజగోపాల స్వామి వార్షికోత్సవం

మండవల్లి: అల్లినగరంలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ రాజగోపాల స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం జరుగుతుందని నిర్వాహకులు గురువారం తెలిపారు. విశ్వక్సేన పూజ, పుణ్యావచనం, దీక్షధారణ, పంచామృత మండపారాధన, స్వామివారికి అభిషేకం, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

కూటమి పాలనలో కన్నీళ్లు !

- సచివాలయాల వ్యవస్థ నిర్వీర్యం
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు



తామరకొల్లు గ్రామంలోని సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం

కైకలూరు: కులం, మతం, వర్గాలు, పార్టీలు చూడకుండా కేవలం అర్హతే ఆధారంగా అందించిన సంక్షేమ పాలనకు.. నేడు ఏడాది పూర్తి చేసుకోనున్నా కూటమి పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి సచివాలయ పరిధిలో రూ.కోటి వ్యయంతో సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, ప్రభుత్వ పథకాలను ఇంటింటికి చేర్చే 50 ఇళ్లకు ఒక వలంటీర్ వ్యవస్థ ఉండేది. నేడు గ్రామాలు పచ్చని పంట మాయమై ఎడారిలా దర్శనమిస్తున్నాయి. ఇదేంటని అడిగితే బెదిరింపులు, ఎదిరిస్తే దాడులు నిత్యకృత్యంగా మారుతున్నాయి.

కరోనాలో వలంటీర్ల సేవలు..

ప్రస్తుత పరిస్థితుల్లో కరోనా కేసులు బయటపడుతున్నాయి. మరోసారి వలంటీర్ల సేవలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో వైరస్ అనుమానిత లక్షణాలు కలిగిన వ్యక్తులను వలంటీర్లు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చిన వ్యక్తుల కదలికలను గుర్తించి వైరస్‌ను అడ్డుకునేందుకు వారియర్‌గా పనిచేశారు. ప్రాణాలకు లెక్క చేయకుండా పనిచేసిన వలంటీర్లను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేదు. కైకలూరు నియోజకవర్గంలో 1,409 మంది వలంటీర్ల ఉపాధి మార్గాలను చిదిమేసింది.

రైతు భరోసా కలేనా..

రైతు భరోసా కింద అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.13,500 వైఎస్సార్ సీపీ సాయం అందించింది. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ఏడాదికి రూ.20 వేలు అందిస్తానని మోసం చేసింది. నేడు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు వెలవెలబోతున్నాయి. ప్రతి పనికి మళ్లీ మండల కేంద్రాల చుట్టూ తిరిగే పరిస్థితి గోచరిస్తోంది. ఇదే కాకుండా కార్పొరేట్ స్థాయికి తగ్గకుండా ఇంగ్లిషు మీడియం కేంద్రాలకు మార్చిన పాఠశాలల్లో నేడు ఆ సంస్కృతి కనిపించడం లేదు. విలేజ్ క్లినిక్‌ల వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు జగన్ మోహన్‌రెడ్డి పాలనను గుర్తు చేసుకుంటున్నారు.

వైఎస్ జగన్ పాలనలో అభివృద్ధి ఇలా..

వివరాలు	సంఖ్య	నిధులు(రూ.లక్షల్లో)
సచివాలయాలు	79	3160
రైతు భరోసా కేంద్రాలు	45	981
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	57	1185.93
మిల్క్ సెంటర్లు	2	35.34
మన బడి నాడు –నేడు(ఫేజ్ –1)		1046.85
మన బడి నాడు –నేడు(ఫేజ్ –2)		3839
మన బడి నాడు –నేడు(ఫేజ్ –3)		159.64

వలంటీర్ల సేవలు భేష్



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా సంక్షేమ పథకాలు అందించేవారు. వారి సేవలను ఇప్పటికీ తలుచుకుంటున్నాం. అక్కా, చెల్లీ ఇలా ఆప్యాయంగా పలకరించేవారు. ఇప్పుడు వివిధ సర్టిఫికెట్లకు ఎక్కడకు వెళ్లాలో తెలియడం లేదు. వలంటీర్లు కొనసాగితే బాగుండేది.

– కొల్లా రాజీ, గృహిణి, మండవల్లి

గతంలో అన్ని పనులు అయ్యేవి..



జగన్ బాబు పాలనే వేరు. నా కుమార్తెకు రాసిచ్చిన పొలం పాస్‌బుక్ గురించి సచివాలయానికి తిరుగుతున్నాను. పని కావడం లేదు. వైఎస్ జగన్ పాలన ఉంటే ఈ ఇబ్బందులు ఉండేవి కావి. గ్రామంలోని సచివాలయంలో వలంటీర్ల ద్వారా అన్ని పనులు అయ్యేవి.

– నున్న నాగ సూర్యనారాయణరావు, తామరకొల్లు

పోల్‌రాజ్ కాల్వకు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ వాసురాజు, సిబ్బంది

కైకలూరు: పోల్‌రాజ్ కాల్వకు సంబంధించి అయ్యవారి రుద్రవరం గ్రామం నుంచి కైకలూరు వరకు యంత్రంతో చెత్త, గుర్రపుడెక్క పనులు శరవేగంగా చేస్తున్నామని డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ) చైర్మన్ పొత్తూరి వాసురాజు గురువారం చెప్పారు. అయ్యవారిరుద్రవరం వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాసురాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీనివాస్ ఆదేశాలతో పంట కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతు పనులు చేస్తున్నామన్నారు. కాల్వలు, డ్రెయిన్లలో చెత్త, నరికిన చెట్లు, జంతువుల కళేబరాలు విసిరిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నీటి సంఘ అధ్యక్షుడు బొల్లెంపల్లి కృష్ణారావు, ఇరిగేషన్ ఏఈ కిశోర్, సిబ్బంది ప్రసాద్, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత



బొమ్మినంపాడులో కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

ముదినేపల్లిరూరల్: ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలోని బొమ్మినంపాడులో గురువారం బుర్రకథ కళాకారులు కళాజాత నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గుడివాడకు చెందిన ఎం.శేఖర్‌బాబు బృందం ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎయిడ్స్ సోకిన వారిని ఆదరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. స్థానిక ప్రముఖులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న దాత చంద్రశేఖర్‌రావు

పామర్రు: దాతల సహకారంతో కూడలి వద్ద మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమని లయన్స్ రీజియన్ చైర్మన్ ఉప్పద్రష్ట రాంబాబు పేర్కొన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద లయన్స్ క్లబ్ కార్యవర్గ నేత కూనపరెడ్డి చంద్రశేఖర్, ధనలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం పురస్కరించుకుని మజ్జిగ పంపిణీ కేంద్రం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులే దాతలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ప్రసంశనీయమన్నారు. క్లబ్‌ను సేవల్లో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండే విధంగా సభ్యులు అందరూ కలిసి కృషి చేయాలని చెప్పారు. 1,200 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు పీఎంఎస్ ప్రసాద్, లంకపల్లి శ్రీనివాసరావు, కె.దుర్గాప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేస్తున్న సోమేశ్వరం కాలనీ ప్రజలు

కైకలూరు: శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ ఆలపాడు పంచాయతీ శివారు సోమేశ్వరం కాలనీ వాసులు 70 మంది కైకలూరు తహసీల్దార్ ఎండీ.ఇబ్రహీంకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ పెద్ద జే.విజయ్‌కుమార్ మాట్లాడుతూ నేషనల్ హైవే అధికారులు రెండు లైన్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జిని సోమేశ్వరం కాలనీ వద్ద నిర్మించారన్నారు. దీంతో చుట్టూ తిరిగి మూడు కిలోమీటర్ల దూరంలో శ్మశానానికి మృతదేహాలను తీసుకువెళుతున్నామన్నారు. సమీపంలో రైల్వే గేటు దాటి కొందరిని ఖననం చేస్తున్నామన్నారు. రైల్వే శాఖ డబుల్ ట్రాక్ వేయడంతో అక్కడ స్థలం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో గత్యంతరం లేక సోమేశ్వరం సమీపంలోని హైవే అథారిటీకి చెందిన 70 సెంట్లు ఉపయోగించని భూమిలో క్రైస్తవ సాంప్రదాయం ప్రకారం సమాధులు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే శ్మశాన వాటికను మార్చుకుంటామన్నారు. తహసీల్దార్ ఇబ్రహీం మాట్లాడుతూ సమాధులు చేస్తున్న భూమి హైవే ఆధీనంలో ఉందన్నారు. మరో చోట భూమిని కేటాయించే అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు చిల్లా మోషే, పెనుమాల ఆంటోని, సిద్దాబత్తుల ఏసుబాబు, వాసపల్లి రత్నభూషణం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలు చేస్తున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్, అధికారులు

గుడివాడరూరల్: యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఒత్తిళ్లను తగ్గించుకోవచ్చని ఎంపీడీవో టీవై విష్ణుప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన యోగాసనాలు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. యోగ సాధన వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందుతారన్నారు. మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రేణుకా పరమేశ్వరునికి అన్నాభిషేకం



స్వామివారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

పామర్రు: అంకమ్మతల్లి ఆలయంలోని రేణుకా పరమేశ్వరునికి గురువారం అన్నాభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జ్యేష్ఠ మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష కార్యక్రమాలను చేశారు. తొలుత స్వామివారికి ఆవుపాలు, పంచామృతాలతో విశేషంగా అభిషేకాలను చేపట్టారు. అనంతరం మచిలీపట్నం వాస్తవ్యులు కొర్రపాటి శ్రీనివాస్ శ్రీదేవి దంపతులు, భక్తులచే స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించామని ఆలయ కమిటీ చైర్మన్ వరదా అప్పారావు తెలిపారు. ఆలయంలో దేవీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నాభిషేకం చేసిన అన్నాన్ని అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, ఎం.పేరయ్య, రమేష్, దుర్గాప్రసాద్, చెన్నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



ప్రదర్శనను తిలకిస్తున్న సీఎంఎం బసవేశ్వరరావు

గుడివాడటౌన్: మహిళలను ఆర్థికాభివృద్ధికి మెప్మా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని మెప్మా సీఎంఎం కేవీవీ బసవేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మాబజార్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ.. సమాఖ్య సంఘాల్లో నైపుణ్యం కలిగిన, వివిధ వృత్తులపై అవగాహన కల్గిన సభ్యులచే తయారు చేసిన వస్తువులను ఇక్కడ ప్రదర్శించి విక్రయాలు చేపడుతున్నామన్నారు. అందుకు సమాఖ్య సంఘాలు ఆర్థికంగా ప్రోత్సహిస్తాయని చెప్పారు. తద్వారా సేకరించిన లాభాలను సమాఖ్య సంఘాల సభ్యులకు పంపిణీ చేసి వారి ఆర్థిక ఎదుగుదలకు దోహదపడుతున్నామన్నారు. కార్యక్రమంలో టిడ్కో కో–ఆర్డినేటర్ ఆనంద్, సీఓలు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు



థియేటర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం

కైకలూరు: కలెక్టర్ ఆదేశాలతో కైకలూరులో విజయలక్ష్మి, వెంకటరమణ సినిమా థియేటర్లను తహసీల్దార్ ఎండీ.ఇబ్రహీం గురువారం తనిఖీలు చేశారు. టికెట్ రేట్లు, మరుగుదొడ్ల శుభ్రత, థియేటర్ క్యాంటీన్లలో విక్రయించే ధరల పట్టికలను పరిశీలించారు. ఎమ్మార్పీకి మించి కూల్‌డ్రింక్, వాటర్ బాటిల్స్, ఇతర తినుబండారాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని థియేటర్ల సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వేంకటేశ్వరరావు, వీఆర్వోలు చంద్రశేఖర్, పాయిస్, సాయి, సురేష్, రాజారత్నం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి



జమీగొల్వేపల్లిలో తాము వేసిన చిత్రాలను చూపుతున్న చిన్నారులు



పామర్రులో క్విజ్ పోటీలను నిర్వహిస్తున్న అధికారి రుహాన్సీరాణి



విద్యార్థులకు గణితంపై బోధిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీదేవి



రాజేంద్రనగర్‌లో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు



కోరుకొల్లులో విద్యార్థులు

ముదినేపల్లిరూరల్: ప్రాథమిక స్థాయిలోనే గణితంపై పట్టు సాధించాలని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి ఎం.శ్రీదేవి విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గురువారం గణితంపై అవగాహన కల్పించారు. గణితంపై విద్యార్థుల్లో నెలకొన్న భయాలు కేవలం అపోహలేనని, తెలివైన పద్ధతుల్లో దీనిని అభ్యసించి అత్యధిక మార్కులు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం రన్నింగ్‌రేస్, లెమన్ అండ్‌స్పూన్ పోటీలు నిర్వహించారు.

చిత్రలేఖనం ఊహకు రూపాన్ని ఇచ్చే చక్కటి సాధనం

జమీగొల్వేపల్లి(పామర్రు): చిత్రలేఖనం ఊహకు రూపాన్ని ఇచ్చే ఒక చక్కటి సాధనమని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ పేర్కొన్నారు. మండల పరిధి జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా చిత్ర లేఖనంపై గురువారం పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చూడ చక్కని ఆహ్లాదకరమైన చిత్రాలు గీసి, వాటికి రంగులు అద్ది సహజత్వం ఉట్టి పడేలా చిత్రాలను ప్రదర్శించారు.

కళకు పరిమితులు లేవు..

ఆయన మాట్లాడుతూ.. కళకు పరిమితులు లేవని, సహజత్వాన్ని ప్రతిబింబించే చిత్ర లేఖనం ఒక వైపు అయితే కల్పిత లోకాలలో విహరించేది మరొక వైపు అన్నారు. సంస్కృతీ సాంప్రదాయాలు, జీవన శైలి ఇలా దేనినైనా ఆవిష్కరించగలిగేదే చిత్ర లేఖనమని చెప్పారు. విద్యార్థుల్లో మనో వికాసం, సృజనాత్మకతకు చిత్ర లేఖనం దోహద పడుతుందన్నారు. చిన్నారులు విద్యార్థి దశ నుంచే కళలపై మక్కువ పెంచుకోవాలని అన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ కృష్ణమోహన్, చంద్రశేఖర్, సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పామర్రులో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించామని గ్రంథాలయ అధికారి ఎం.రుహాన్సీరాణి పేర్కొన్నారు. తదుపరి విద్యార్థులచే మ్యూజికల్ చైర్ ఆడించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడివాడలో శిక్షణ తరగతులు

గుడివాడటౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు గురువారం కొనసాగాయి. శిక్షణలో భాగంగా చదవడంపై శ్రద్ధ అనే అంశంపై విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఆసక్తి గల అంశాలు పొందుపర్చిన పుస్తకాలను విద్యార్థులచే చదివించి వాటి భావాలను వారికి అర్థమయ్యేలా వివరించామని చెప్పారు. తద్వారా చిన్నారుల్లో చదవడంపై ఆసక్తి పెరిగి, జ్ఞానవంతులవుతారని గ్రంథాలయ అధికారి పి.శాంతి తెలిపారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

కలిదిండి(కైకలూరు): వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహ భరిత వాతావరణంలో గ్రంథాలయాల్లో కొనసాగుతున్నాయి. జూన్ 6వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారులు తెలిపారు. కలిదిండి మండలం కోరుకొల్లు శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, పుస్తక పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రాఘవులు, సిబ్బంది ప్రకాష్ పాల్గొన్నారు.

ఆస్తి వివాదంలో ముగ్గురిపై కేసు నమోదు

కలిదిండి(కైకలూరు): ఉమ్మడి ఆస్తి విషయంలో జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కలిదిండి పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చినపుట్లపూడి గ్రామంలో సంకరపు మహాలక్ష్మి, కొల్లాటి లక్ష్మికి ఉమ్మడి గృహం ఉంది. కొల్లాటి లక్ష్మి కుటుంబం కొన్నాళ్లు బయట నివాసం ఉంటూ తిరిగి గ్రామానికి వచ్చారు. ఇంటిలో ఉమ్మడి ఆస్తి విషయమై గొడవ జరిగింది. దీంతో లక్ష్మి ఫిర్యాదుపై మహాలక్ష్మి, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశ్నించినందుకు దాడి చేశారని ఫిర్యాదు


ముదినేపల్లిరూరల్: మండలంలోని పెయ్యేరు వైఎస్సార్ కాలనీలో డ్రెయినేజీ పనులకు సంబంధించి ప్రశ్నించినందుకు తనపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. కాలనీలో కొన్నిరోజులుగా డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయి. అదే కాలనీకి చెందిన మొవ్వ ఫణీంద్ర ఈ పనులకు సంబంధించి అక్కడ పర్యవేక్షణ చేస్తున్న జి.రామారావును ప్రశ్నించాడు. దీనితో రామారావు, అప్పారావు, సరోజని అనే వ్యక్తులు తనను దుర్భాషలాడి దాడి చేశారని ఫణీంద్ర పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



గుడివాడటౌన్: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి ఆర్కే వారియర్స్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద అనాథగా పడి ఉన్న శవానికి వారియర్స్ అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్కే వారియర్స్ వ్యవస్థాపకుడు రామకృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికి 133 అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆర్కే వారియర్స్ సభ్యులు నేతాజీ, ఎ.రవికిరణ్, జి.చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బోర్ ఏర్పాటుకు భూమిపూజ



నిమ్మలూరు(పామర్రు): స్థానిక ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో మంచినీటి బోర్‌ను ఏర్పాటు చేశామని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. నిమ్మలూరు గ్రామంలో బోర్ ఏర్పాటుకు గురువారం భూమిపూజ చేశారు. రూ.3.60 లక్షల ఎస్టిమేషన్‌తో బోర్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలందరికీ సురక్షిత తాగునీటిని అందించాలని ఎంపీపీ ఆదేశించారు. ఎంపీటీసీ పల్లికొండ రత్నకుమారి, సర్పంచ్ గోపాలం, స్థానికులు రాము, సీతారామయ్య, నాంచారయ్య, రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాబా మందిరంలో అన్నసమారాధన

మండవల్లి: స్థానిక పీహెచ్‌సీ వద్ద కొలువై ఉన్న శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత బాబావారికి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్నప్రసాదం స్వీకరించారు. మందిర నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.